

# ఈ గాలి నాది! ఈ నేల నాది!!

**- టి.ఎస్.ఎ.కృష్ణమూర్తి**

బస్టాండు నిండుగా జనాలున్నారు. కూర్చోవడానికెక్కడా జానెడు జాగా కూడా కన్పించడం లేదు.

నా బస్సింకా రాలేదు.

ఒకే ఒక బెంచీమీద మాత్రం ఐదుగురు కూర్చుని వున్నారు. వాళ్ళ ప్రక్కగా ఓ చివర్న మాత్రం ఒక మనిషి కూర్చోవడానికి కాస్త ఖాళీ కన్పించింది.

ఆ బెంచి దగ్గరకు వెళ్ళి చివర్న సర్దుకుని కూర్చుని నా జిప్ బ్యాగుని జాగ్రత్తగా ఒడిలో ఉంచుకున్నాను.

వాళ్ళ పిల్లవాడు కాబోలు... బెంచి మధ్యనుండీ క్రిందికి దిగేసి రెండడుగులు ముందుకెళ్ళి నిలబడి అటూ ఇటూ చూడ సాగాడు.

"నేనున్నా లేకపోయినా బిడ్డల్నెలాగయినా బాగా సదివించాలి భాగ్యం!" అంటున్నాడు నా ప్రక్కన కూర్చున్నతను... కుర్రాడినే చూస్తూ!

అతనికేసి పరీక్షగా చూశాను.

మనిషి బాగా ఎముకలు తేలి, ఎండిపోయి వున్నాడు. ఒంట్లో కాస్తయినా రక్తమున్న దాఖలాలు కన్పించడం లేదు. పొట్ట మాత్రం ఉండాల్సిన దానికన్నా పెద్దగా... నిండుగా... వికారంగా కన్పిస్తోంది. పీక్కుపోయిన ముఖంలో కళ్ళయితే మరీ ఎండిపోయి గాజుకళ్ళలా జీవం లేకుండా కన్పిస్తున్నాయి.

"నీకేం కాదు మామా!" అంది అతని ప్రక్కనే కూర్చున్న ఆడమనిషి. ఆమె స్వరంలో ఆశ, అపనమ్మకం పోటీపడ్తున్నాయి.

అప్పుడు చూశాను ఆమెకేసి.

ఆమె కళ్ళలోంచి కన్నీరు కారిపోతోంది. శోక దేవతలా వున్న ఆమె ముఖం, రూపం చాల దీనంగా కన్పిస్తున్నాయి.

వారికి అవతల ఇద్దరు వృద్ధ దంపతులు... ఆమెకు అరవయి, ఆయనకు డెబ్బయి సంవత్సరాలుండవచ్చు. వారిద్దరి ముఖాలలో కూడా దైన్యమే కన్పిస్తోంది.

"ఏ జన్మలో ఏం పాపం చేశానో... నాకీగతి వచ్చింది! మీరంతా సజావుగా బ్రతకండి!... ఏ తప్పులూ చేయకండి!" అన్నాడతను.

అతని మాటలకు ముగ్గురి కళ్ళలోనూ కన్నీరు తిరగడం నాకు తెలుస్తూనే వుంది. కుర్రాడు మాత్రం అదేం పట్టించుకోకుండా ప్రక్కనే వున్న వెయింగ్ మిషన్‌లోని లైట్లను చూస్తున్నాడు.

అంతలో బెంగుళూరు వెళ్ళే బస్సు వచ్చి మాముందున్న ఖాళీలో ఆగింది.

ఆ బస్సుకు పెద్దగా రద్దీ లేనట్లుంది... నా ప్రక్కనున్న జబ్బు మనిషీ... అతని తండ్రి కాబోలు... ముసలాయనా ఇద్దరూ ఓ సంచితోపాటు వెళ్ళి బస్సెక్కి మధ్యలో ఇటు వైపు కిటికీ ప్రక్కగా కూర్చున్నారు.

అతనేదో చెప్తున్నాడు... క్రింద నిలబడ్డ ఆడవాళ్ళిద్దరూ ఏడుస్తున్నారు. పిల్లవాడు మాత్రం అదేం పట్టించుకోకుండా అటూ, ఇటూ తిరుగుతున్నాడు.

పది నిముషాల తరువాత బస్సు స్టార్టయింది. పిల్లవాడ్ని దగ్గరకు పిలిచింది వాడి తల్లి. వాడి జబ్బు తండ్రి బస్సులోంచి ఏదో చెప్పాడు. పిల్లవాడు బుద్ధిగా తల వూపాడు.

బస్సు వెనక్కి వచ్చి, ముందుకు వెళ్ళిపోయింది.

బస్సు కనుమరుగు కాగానే ఆమె రోదిస్తూ వెనక్కి వచ్చి నేను కూర్చున్న బెంచీ మీదే ఆ చివర్న కూర్చుంది తల పట్టుకుని.

అప్పుడు మాత్రం పిల్లవాడిలో కాస్త హుషారు తగ్గింది. వాడు తన తల్లినే చూస్తూ ముసలామెతోపాటు బెంచి దగ్గరకు వచ్చాడు దిగులుగా.

"ఊరుకోమ్మా... పద ఇంటికి పోదాం!" అంది ముసలామె.

"ఇంటికిపోయి ఇంకెట్లా బతుకుతామత్తా!" అంటూ రోధిస్తోంది ఆమె.

"దేవుడున్నాడు మనపాలిట... బిడ్డ దిగులు పడ్తాడు పద!"

ముసలామె మాటతో ఆమె దుఃఖం కాస్త తగ్గింది. కానీ ఆమె లేవలేదు, తల పైకెత్తలేదు. కుర్రవాడు చప్పగా అయిపోయి తల్లిప్రక్కన కూర్చున్నాడు.

చుట్టుపట్ల వాళ్ళు వాళ్ళనే చూస్తున్నారు... ఆశ్చర్యంగా, జాలిగా.

"బస్సులో వెళ్ళింది మీ కొడుకా?" అని ముసలామెను ప్రశ్నించాను.

"అవున్నాయనా?"

"కూడావెళ్ళినాయన?"

"వాళ్ళ నాయన!"

"ఏం జబ్బు?"

"కడుపులో గడ్డ... అదేదో క్యాన్సరు గడ్డట... నయం కాలేదు... గడ్డ తీసినా బతకడు... తీయకపోయినా బతకడు... డాక్టర్లు పెట్టిన గడువూ అయిపోవచ్చింది..." అంది గద్గదంగా.

ఆమె కోడలి దుఃఖం అధికమైంది.

నా మనసూ, హృదయం రెండూ భారంగా తయారయ్యాయి. బస్సులో వెళ్ళిన జబ్బుమనిషి రూపమే కళ్ళ ముందు మెదుల్తోంది.

★ ★ ★

అరగంట తరువాత పెద్దకాలువ గట్టుమీద నిలబడి అటూ, ఇటూ చూశాను. దగ్గరి దాపులలో మానవమాత్రులు లేరు.

మొన్నమొన్నటిదాకా కురిసిన భారీ వర్షాల తాలూకు తాకిడి క్రింద కాలువలో సుడులుతిరుగుతూ వేగంగా ప్రవహిస్తున్న నీటిలో కన్పిస్తోంది.

జిప్పులాగి బ్యాగు తెరిచాను.

పైనున్న మెత్తటి దుప్పట్లు రెండూ తీసివెయ్యగానే చిన్న చిన్న తువ్వాళ్ళతో చుట్టబడ్డ ఆరు నాటు బాంబులు నిండుగా కన్పించాయి.

"ఏ జన్మలో యేం పాపం చేశానో... నాకీ గతి వచ్చింది... మీరంతా సజావుగా బ్రతకండి... ఏ తప్పులూ చేయకండి!"... జబ్బుమనిషి మాటలు చెవులలో ప్రతిధ్వనిస్తోండగా ఒక్కొక్క బాంబునీ జాగ్రత్తగా తీసి తువ్వాలు చుట్టుతోపాటు ప్రవహిస్తున్న నీళ్ళలోకి విసరసాగాను.

సాగుతున్న నీటిలో బాగా నానితే అవి నిర్వీర్యం అయిపోవడానికి ఎక్కువ సమయం పట్టకపోవచ్చు.

ఆ పని పూర్తయ్యాక హృదయం కాస్త తేలిక పడినట్లయింది. దుప్పట్లు రెండూ బ్యాగులో పెట్టుకుంటూంటే జబ్బుమనిషి కుమారుడి రూపం కళ్ళముందు కదిలి కడుపులో బాధ మెదిలింది.

వాడి వయసులో ఉన్నప్పుడే నా తండ్రిపోయాడు.

దగ్గరి దాపులలోని పేటలో ఆడుతున్న సర్కస్ తాలూకు గుర్రం ఒకటి, ఎలాగో తప్పిపోయి పల్లెలమ్మట తిరిగి మా పల్లె చేన్లలోకి వచ్చి గడ్డి మేస్తోంటే మరో ఇద్దరు పిల్లావాళ్ళతో కలిసి దాని వెంబడి పరుగులు తీస్తున్నాను.

అప్పుడు వచ్చి చెప్పారు ఎవరో... ఇంట్లో జబ్బుపడి వున్న మా నాయన చచ్చిపోయాడని, అందరూ ఏడుస్తున్నారని.

నేనది పట్టించుకోకుండా గుర్రం వెంబడి పరుగులు తీశాను.

చావంటే ఏమిటో, నేను పోగొట్టుకున్నదేమిటో తరువాత తరువాత తెలుస్తూ వచ్చింది!

అదంతా జ్ఞాపకానికి రావడంతో బస్టాండులో కన్పించిన కుర్రాడిని తల్చుకుంటూంటే కడుపులో బాధ పెరిగి పెద్దదవుతోంది.

బాధపడ్తూనే బ్యాగు సర్దుకుని బయల్దేరాను.

అంకిపాడు మిట్ట క్రిందికి వచ్చి బస్టాపు చేరుకునేసరికి సిటీ బస్సు వచ్చింది.

★ ★ ★

నేనిల్లు చేరేసరికి బాబు బడికిపోయాడు. కనకం నన్ను చూసి ఆశ్చర్యపోతూ ప్రశ్నించింది.. "ఊరికి పోలేదా?" అని.

"బస్టాండులోనే ఆ వూరి మనిషి కన్పించాడు. పనయిపోయింది!"అంటూ అపద్ధమాడాడు.

నేను చేస్తున్న పనేమిటో కనకానికి తెలియదు. ఏదో దండులో కొలువనుకుంటోంది. తెలిస్తే ఉరిపోసుకుని ఛస్తుంది.

ఆలస్యం లేకుండా త్వరగా అన్నం వండే ప్రయత్నాలలో పడింది కనకం. నేను ఆలోచనలలో పడ్డాను.

నేను లేకుండా పోయినప్పుడు కనకం, బాబుల పరిస్థితి ఏమిటా? అన్నది అప్పటి నా ఆలోచన... అంతవరకూ నాకు రాని ఆలోచన.

⁂ ⁂ ⁂

రాత్రయింది... బాబు నిద్రపోయాడు.

నా ఆలోచనలు తెగడం లేదు.

"ఒక మాటడగనా?" అంది కనకం.

"ఏమిటి?"

"దేశమంతా వానలు పడి వరదలొచ్చాయి కదా?"

"అవును!"

"మన ఇలాకాలోనూ పడి మనూరి చెరువులూ నిండాయేమో?"

... కనకం కళ్ళలో ఆశలు, ముఖంలో స్వంత నేల కళ్ళ ముందు కదుల్తున్న పులకింత, ఆనందం!

నా మనసులో తళుక్కున ఓ మెరుపు మెరిసింది.

ఆ దిశగా నా ఆలోచనలు సాగలేదన్నది మాత్రం నిజం.

మనిషి మనిషిగా బ్రతకడం మానేసినప్పుడు ఆలోచనలు మాత్రం సజావుగా ఎందుకు సాగుతాయి?

నా కళ్ళముందు నా ఊరు, నా వాళ్ళు మెదిలారు...

ఎందరున్నారో? ఎందరుపోయారో??

పసికందునూ, కనకాన్నీ తీసుకుని ఊరు దాటి, తాలూకా దాటి... మూడు జిల్లాలు దాటి ఇంత దూరం వచ్చేసి ఆరేండ్లు దాటిపోయాయి.

అక్కడి విషయాలేమీ తెలియవు! నా విషయాలూ అక్కడ తెలియవు!! తెలిసే అవకాశమే లేదు... ఎందుకంటే... నేనిక్కడున్నట్లు అక్కడ ఏవరికీ ఏమాత్రం తెలియదు... తెలియకుండా జాగ్రత్తపడ్డాను.

నా ప్రాణంలో ప్రాణంలాంటి నా పల్లెటూరు కళ్ళ ముందు మెదిలింది.

★ ★ ★

పెద్దచెరువు అడుగు ఎండ కన్నెరుగదు. చెరువుక్రింద సదా కన్పించే పచ్చని పొలాలలో వరి, చెరకు పంటలు...

గింజలు పారేసి వస్తే చాలు రాగి, సద్ద, జొన్న, కంది, వేరుసెనగ పంటలనందించే చేన్లు.

ఎటుచూసినా కానుగ, పగులు పచ్చారు, రాగి, వేప, చింత, తాటి, ఈత చెట్లు. ముప్పక్కలా చుట్టి సాగే కాలువ. ఆపై చుట్టూ నీలికొండలు. సదా సాగిపోయే తెల్ల మబ్బులు, చల్లగా వీచే పిల్లగాలులు.

వీటన్నిటి మధ్యనా... ఆకుచాటున ఒదిగివున్న అందమైన చిన్న పక్షిలాంటి పల్లెటూరు మాది!

నా తండ్రి పోయాక నేనూ, నా తల్లీ ఉన్న కొద్దిపాటి పొలం సాగు చేసుకుంటూ తినీ, తినకా కాలం గడుపుతూ తమ్ముడ్ని పెద్దవాణ్ణి చేశాం. నాకబ్బిన మాత్రమైనా చదువొంటబట్టలేదు వాడికి.

పది కాలాలపాటు పదిలంగా బ్రతకాలంటే మనిషి పనిచేస్తుండాలి. మరీ పల్లెటూర్లలో అయితే సజావుగా నడవాలంటే పనివాడుగానే వుండాలి.

కానీ కర్మవశాత్తు నా తమ్ముడు తినువాడుగా తయారయ్యాడు.

వయసొచ్చాక కూడా పనిపాట లేవీ పట్టించుకోకుండా ఎనిమిది మూరల తెల్ల పంచె కట్టుకుని, తెల్లటి చొక్కా తొడుక్కుని సైకిలెక్కి చుట్టుదారిన వెళ్ళి బ్రిడ్జిమీదుగా కాలువ దాటి పేటకు తిరగడమే పనిగా పెట్టుకున్నాడు.

పేటలో అయినా వాడు ఊడబొడిచేదేమీ లేదని తెలుసు.

దళారీ వ్యాపారం చేసి వాడి గొడ్లు వీడికీ, వీడి గొడ్లు వాడికీ అమ్మి పెట్టి కమీషన్ కొట్టడం, హోటల్లో బిరియానీ తినడం, సినీమా చూడడం.

నిజానికయితే చిన్నతనంనుండీ కూడా వాడి చేతుల్లో మంచి పనితనం వుంది. ఆయిలింజన్లలో ఎక్కడ లోపం వచ్చినా అరగంటలో అరువు చెయ్యగలడు. ఫీల్డు మార్షల్ పెద్దింజన్ను మొత్తం ఊడదీసి ఒక్కరోజులో ఓవరాలింగ్ చేసి బిగించి వెయ్యగలడు.

అమ్మకు తమ్ముడంటె వల్లమాలిన ప్రేమ. నాకూ వాడంటే ప్రాణమే... కానీ సోమరితనం నాకు సరిపడదు. అయినా అమ్మ బాధపడ్తుందని ఊరుకుని. ఊరుకుని నేనే వాడ్ని పాడుచేశానేమో? సరిగ్గా నాకే తెలియదు. గొడ్డులా పనిచెయ్యగల వాడే పల్లెల్లో మనిషి క్రింద లెక్క మరి.

డీసెలు ధర పెరిగి కరంటు మోటార్లు పల్లెల్లో ప్రవేశించాక వాటి పనీ సులువుగానే తెలుసుకునేశాడు. వాడి పనితనం చూసే వాడికి మంచి బిడ్డనిచ్చి పెళ్ళిచేశారు పక్కవూరి బంధువులు. కానీ ఏంలాభం? అంగట్లో అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు... వాడికి నడుం వంగితే కద?

అమ్మకు వాడంటే వల్లమాలిన ప్రేమ. నాకూ వాడంటే ప్రాణమే... కానీ సోమరితనం నాకు సరిపడదు. అయినా అమ్మ బాధపడ్తుందని ఊరుకుని, ఊరుకుని నేనే వాడ్ని పాడుచేశానేమో? సరిగ్గా నాకే తెలియదు. గొడ్డులా పని చెయ్యగల వాడే పల్లెల్లో మనిషి క్రింద లెక్క మరి.

కాలం ఏదోఒకలా కదిలిపోతోంటే ఏడేండ్ల కరువొచ్చి పడింది. ఎండ కన్నెరుగని చెరువడుగూ ఎండిపోయి బీటలుబారింది. బావులూ ఎండిపోతూ వచ్చాయి. సాగునీటి మాట దేవుడెరుగు...తాగునీటికీ కటకట అయిపోయింది. మనిషి బతుకే కష్టమయిపోయింది.

ఒకటారెండా... సంవత్సరాలు గడచిపోతున్నాయి. సరైన వానలు లేవు. పడే అరకొర వానలూ రైతును మోసంచేసి దెబ్బతీశాయి. గాదెలూ, గరిసెలూ, నేల మాళిగలూ కూడా నిండుకున్నాయి. గడ్డివాములు తరిగిపోయాయి.

ఎక్కువ మంది మనుషుల ముఖాలలో దైన్యం, బాధ, ఆకలి కన్పించడం సాధారణం అయిపోయింది. నాకడానికయినా పచ్చిక కన్పించక గొడ్లు దిగులుపడి బక్కబారిపోతున్నాయి.

పూలమ్మినచోట కట్టెలమ్మ లేక... అప్పులతో, అవమానాలతో, ఆకలితో మనుష్యులు బలవంతంగా ప్రాణాలు వదిలేస్తున్నారు. కళకళ లాడిన లోగిల్లు వెలవెలబోతున్నాయి.

పులిమీద పుట్రలా తమ్ముడి బుర్రలో ఓ కొత్త ఆలోచన వచ్చేసి మా ఇంటిల్లిపాదినీ గందరగోళానికి గురిచేసేసింది. ఉన్న పొలం, ఇల్లు అయినకాడికి అమ్మేసి అందరూ ఘటోద్గజపురం చేరిపోవాలన్నది వాడి ఆలోచన.

వరుస కరువుపల్లె రైతులను పడగొట్టినట్లే ఘటోద్గజపురం పేటలోని మనుషులనూ పడగొడ్తున్నట్లుంది...

ఆ వూర్లో నీళ్ళు నిండుకున్నాయి...

ఘటోద్గజపురం మునిసిపాలిటీ వాళ్ళు నీళ్ళ ట్యాంకులతో దూరంనుండీ నీళ్ళు తెప్పించి ఊరి ప్రజలకు సరఫరా చేస్తున్నారు. నీళ్ళ ట్యాంకులను నడిపించే వాళ్ళకు ఆ మునిసిపాలిటీ వాళ్ళద్వారా మంచి డబ్బు లభిస్తోంది.

ఇల్లు, పొలం అమ్మేసిన డబ్బుతో ఓ ట్రాక్టరు, నీళ్ళ ట్యాంకు కొనుక్కుని ఓ అద్దె ఇల్లుతీసుకుని ఘటోద్గజపురంలో ఉండిపోవాలన్నది మావాడి ఆలోచన.

"నాయన సంపాదించిన చెక్కరా ఇది... దీన్ని పోగొట్టుకుంటే ఎలా?" అన్నాను.

"ఆ వూర్లో ఆర్నెల్లు నీళ్ళు తోలితే చాలు... ఇలాంటి చెక్కలూ, బల్లలూ రెండింతలు కొనుక్కోవచ్చు మళ్ళీ!"అన్నాడు వాడు నమ్మకంగా.

"ఆలోపు బాగా వానలు పడిపోయి కరువుతీరా నీళ్ళొచ్చేస్తే ఏం చెయ్యాలిరా? అక్కడ నీళ్ళ వ్యాపారముండదు... ఇక్కడ బ్రతకడానికి పొలముండదు! తల దాచుకోడానికి ఇల్లుండదు!!"అన్నాను దూరం ఆలోచించి.

"ఇంక వానలు పడవన్నా... వానలు పడే కాలమెప్పుడో వెళ్ళిపోయింది... మనమీ పల్లె వదలాల్సిందే!" అన్నాడు వాడు ఖచ్చితంగా.

వాడి నీళ్ళ వ్యాపారంకోసం ప్రపంచంలో ఇక వానలే పడవన్న వాడి ఆలోచన మాత్రం నాకు చాల పెద్ద బాధను కలిగించింది.

వాడికి నొప్పి కలగనీయకుండా పెంచి పెద్దచేసి బాధ్యత తెలియనీయకుండా స్వేచ్ఛగా వదిలిన నా తప్పు నాకు తెలిసి వచ్చింది. అంతేకాక కష్టాన్ని నమ్ముకొని వాడి ఆలోచనలు ఎంత దుర్మార్గంగా మారిపోయాయో కూడా స్పష్టంగా తెలిసింది.

"పోనీ వాడు చెప్పినట్లే చేస్తాముర!" అంది అమ్మ. అమ్మ స్వరంలో పల్లెలో ఇల్లూ వాకిల్నీ...కాదు కాదు... తన స్థానాన్ని, తన జ్ఞాపకాలనూ వదులుకోలేని దిగులూ, వాడిమీద ప్రేమా రెండూ కుస్తీ పడ్తున్నాయి.

ఎటూ యేమీ చెప్పలేక నలిగిపోతోంది కనకం కూడా.

ఆ రాత్రి...

అమ్మ కనకం కలసి కరణాన్ని సలహా అడగడానికి వెళ్ళారు.

తమ్ముడు పేటనుండీ ఇంకా దిగబడలేదు!

పెరట్లో కలబంద నారతో తాడు పేనుకుంటున్న నా దగ్గరకు వచ్చింది మరదలు... "బావా!"అంటూ.

"ఏం తల్లీ?"

"మా ఆయన మాటిని పొలం, ఇల్లూ పోగొట్టద్దు బావా!"

"ఎందుకమ్మా?"

'పేట చేరితే... ఇంకస్సలు ఎవరి మాటా ఇనడు బావా... మా ఇంటాయన సంగతి నాకంటే మీకే బాగా తెలుసు కదా?"

"వాడు బాధపడ్తాడేమో కదమ్మా?"

"ఉన్న ఈ ఆధారమూ పోతే రేపు మనందరం బాధలు పడాలి కద బావా? అప్పటికయినా ఆయనకు తెలిసొస్తుందన్న నమ్మకం లేదే?"

నాకెందుకో ఒళ్ళు జలదరించింది.

వాడికి తెలిసొచ్చేలా నేను కానీ, మా అమ్మ కానీ ఇన్నేళ్ళలో ఒక్క పనీ చెయ్యలేకపోయాము... ఒక్కనాడయినా!! చివరికి ఉన్నదంతా పోగొట్టుకొని ఊరు వదలక

(మిగతా 20వ పేజీలో)

**(9వ పేజీ తరువాయి)**

తప్పేలా లేదు!... ఊరు వదలక తప్పేలా లేదు!!... ఊరు వదలక తప్పేలా లేదు!!!

నా ఆలోచనలు అక్కడ ఆగిపోయాయో, అక్కడే మొదలయ్యాయో నాకు సరిగ్గా తెలియదు.

ఆ రాత్రే రహస్యంగా ఓ చిన్న బట్టల సంచితో కనకాన్నీ, పసికందునూ తీసుకుని... పల్లెదాటి, ఎండిపోయిన కాలువదాటి, పేట దాటి, తాలూకా దాటి, మూడు జిల్లాలు దాటి... ఈ ఊరికొచ్చి పడ్డాను.

కూలీ నాలీ చేసుకుని బ్రతుకు బండి లాగిస్తోంటే ఈ పని దొరికింది.

బ్యాగో, సూటుకేసో చేర్చమన్నచోటికి పదిలంగా, జాగ్రత్తగా చేర్చడం. నాలుగు డబ్బులు మిగుల్తున్నాయి కదా అని నమ్మకంగా చేస్తూ వచ్చాను కానీ... అందులో... ఇంత విషముందని నాకూ మొన్నమొన్నటి దాకా తెలియదు. తెలిశాక కూడా సాలెగూట్లో చిక్కుకున్న ఈగలా, తేలుకుట్టిన దొంగలా విలవిలలాడ్తున్నాను.

చెయ్యడం నేరం... మానేస్తే ఏం జరుగుతుందోననే భయం.

"ఏ జన్మలో ఏం పాపం చేశానో... నాకీ గతి వచ్చింది... మీరంతా సజావుగా బ్రతకండి... ఏ తప్పులూ చేయకండి!"అన్న ఆ జబ్బు మనిషి మాటలు నాలో అలజడినీ, ఆలోచనలనూ రేకెత్తిస్తున్నాయి. కనకం మాటలా ఆలోచనలకు ఊతమిచ్చాయి.

* * *

"రేపు ఇల్లు ఖాళీ చేసేస్తున్నామయ్యా!" అన్నాను.

నా మాటలు బాధ కలిగించాయో, యేమో? అదోలా చూశాడు ఇంటి యజమాని. తిండి తిన్నా తినకపోయినా అద్దెమాత్రం మొదట్నుండీ చాల నికార్సుగా చెల్లించేవాడ్ని మరి!!

లెక్కవేసి చెల్లించాల్సిన డబ్బు చెల్లించి, ఇల్లు ఖాళీ చేశాక తాళం ప్రక్క ఇంట్లో ఇచ్చి వెళ్తామని చెప్పి బయల్దేరాను.

మనసు చాల తేలికగా, సంతోషంగా ఉన్నట్లనిపించసాగింది.

* * *

ఇంట్లోవున్న వస్తువులన్నీ చవుకగా చుట్టుపక్ల వారికి ఇచ్చేశాము.

"ఏమిటిదంతా?" అంది కనకం అర్థంకాక.

"మనం మనూరినుండీ కట్టుబట్టలతో, చిన్న సంచితో వచ్చాము... వెళ్ళేప్పుడు కూడా అలాగే వెళ్ళాలి!"

"ఎందుకని?"

ఆ ప్రశ్నకు మాత్రం సమాధానం చెప్పలేకపోయాను నేను.

సరుకందించి తిరిగి రావాల్సిన నాటి రాత్రి తిరిగి రావాల్సిన సమయానికి మా జిల్లా మీదుగా వెళ్ళే రైల్లో సగం దూరం వెళ్ళిపోయాం నేనూ, కనకం బాబుతో కలిసి. తెల్లారేసరికి ఇలాకా దాటిపోయాం.

రైలు దిగి స్టేషను వెలుపలికి రాగానే రిక్షాలకు బదులుగా ఆటోలు దర్శనమిచ్చాయి. బాబును అంత దూరం నడిపించడమెందుకని ఆటో ఎక్కాము.

రామచంద్రాపురం అయితే పెద్దగా మారలేదు కానీ రిక్షాబండ్లు, జటకా బండ్లు కన్పించడం లేదు. ఆటోలు అడుగుపెట్టి రిక్షా, జటకా వాళ్ళ కడుపులు కొట్టినట్లుంది.

బస్టాండు చేరాక రెండు ఆర్టీసీ బస్సులు వచ్చాయి... కానీ మా ప్రాంతానికి వెళ్ళేవి కావు.

గంట తరువాత నవాబ్‌సాబు బస్సే వచ్చింది. ఎక్కి కూర్చున్నాక విమానం ఎక్కినంత ఆనందంగా అన్పించ సాగింది. అరగంట అర సంవత్సరంలా గడిచాక బస్సు బయల్దేరింది.

దారేమాత్రం మారలేదు.

"ఈ గాలి నాది, ఈ నేల నాది!!"అని అనుకోసాగాను పదే పదే... కిటికీగుండా చిరపరిచితాలైన ప్రదేశాలనూ, చెట్టుచేమలనూ చూస్తూ మేమీ ప్రాంతం వదిలేనాటికి వరుస కరువులతో ఎడారి నేలలా ఉండిన భూమంతా పచ్చదనంతో పరవశిస్తో కన్పిస్తోందిప్పుడు.

వెంకటాద్రిపురం కూడా ఏమాత్రం మారలేదన్పించింది బస్ దిగేలోపే. అమ్మయ్య హోటల్ అలాగే వుంది. అక్కడే ఫలహారం ముగించుకుని అక్కడ్నుండీ కాలువ గట్టు చేరేసరికి అప్రయత్నంగా కంట నీరు తిరిగింది.

ఎండిపోయిన ఆ కాలువలోంచే చీకటి రాత్రిలో ఈవైపు ప్రపంచానికి పసికందునేసుకుని నడిచి వచ్చాము నేనూ, కనకం.

ఇప్పుడా కాలువ నిండుగా నీరు సుడులు తిరుగుతూ ప్రవహిస్తోంది.

"రాజప్ప మామా... ఎన్నాళ్ళకెన్నాళ్ళకు?"అంటూ కలబంద కట్టల కట్టుబల్ల దగ్గరకు పరుగుపెట్టుకు వచ్చాడు నల్ల చిన్నోడు నన్నూ, కనకాన్నీ గుర్తుపట్టి.

నా మరదల్ని చెట్టునీడన కూర్చోబెట్టి గింజల గంప అందుకుని మడక వెంబడి కదిలింది కనకం. ఆ మట్టి వాసన వదిలి అక్కడ్నుండీ కదలాలనిపించకపోయినా ఇల్లు చూడాలనే కోరికతో ఆతృతగా కదిలాను. బాబునెత్తుకుని నా వెంబడి బయల్దేరింది అమ్మ. ఊర్లోకి అడుగుపెట్టి రచ్చబండ దగ్గరకు చేరగానే నా ఆనందానికి అవధులు లేవు.

బాబుకంతా ఆశ్చర్యంగా వుంది. నల్ల చిన్నోడు మమ్మల్ని కూర్చబెట్టుకుని పొడవాటి కర్రతో కట్టుని కాలువ దాటిస్తోంటే వింతగా, భయంగా చూస్తున్నాడు కాలువనూ, చుట్టుపట్ల ప్రదేశాలనూ.

డబ్బు తీసుకోకుండా మొహమాటపడ్డాడు నల్ల చిన్నోడు. బలవంతంగా వాడి చొక్కా జేబులో వేసి నడపడం మొదలుపెట్టాము కాలిదారిన.

దెయ్యాల గుట్ట ఎక్కి అవతలికి దిగుతోంటే నా వూరు కన్పించడం మొదలుపెట్టింది.

చేన్లల్లో పనులు చేసుకుంటున్న వాళ్ళు గుర్తుపట్టి మా దగ్గరకు వచ్చి పలకరిస్తున్నారు. "ఇన్నాళ్ళూ ఎక్కడున్నారు? ఎలా వున్నారు?" అంటూ ప్రశ్నల వర్షంతో కుశలం కనుక్కుంటున్నారు.

"నీ తమ్ముడు చాలా బుద్ధిమంతుడయిపోయాడ్రా... ఇంటికాడే ఉంటున్నాడు" అంటూ చెప్పారు ఒకరిద్దరు. ఆ విషయం మాకెంతో ఆనందం కలిగించింది.

గుట్ట దిగి కొంచెందూరం నడిచేసరికి అన్నం గంప నెత్తికెత్తుకుని అమ్మ ఎదురయింది. మేం ఆమె కంటబడడం ఆలస్యం... గంప దారిప్రక్కని రాతి మీద పెట్టి ఒక్క ఉదుట్న మా దగ్గరకు వచ్చి బాబునెత్తుకుని భోరున ఏడ్వడం మొదలుపెట్టింది... "మేమేం అయిపోవాలిరా నాయనా?!" అంటూ.

"వచ్చేసినాం కదా?... ఇంకా ఎందుకు ఏడ్వడం?"అన్నా వినటం లేదు.

"ఇంతకూ ఈ అన్నమెవరికత్తా?" అంది కనకం అమ్మ తేరుకున్నాక.

"ఇంకెవరికి? నీ చెల్లెలికీ, నీ మరిదికీ కదా? నీ చెల్లెలిప్పుడు ఒట్టి మనిషి కాదు... యాగిట్లైంది కదా?"అంది అమ్మ ఆనందంగా.

కనకం ముఖం విప్పారింది... కళ్ళలో చెప్పరాని సంతోషం.

"తమ్ముడెలా ఉన్నాడు? పేటకెందుకు చేరలేదు?"అని అడిగాను.

"మీరు వెళ్ళిపోవడంతో అంతా తనవల్లేనని వాడు దిగులుపడిపోయాడ్రా. దాంతో వాడి సోకులూ, తిరుగుళ్ళూ అన్నీ పోయాయి. పిచ్చోని లాగా మీకోసం ఎక్కడెక్కడో వెతికాడు చాన్నాళ్లు. ఆనక బుద్ధిమంతుడయిపోయాడు. ఇల్లు, చేను, మడి... ఇంతే... ఇంకెక్కడికీ పోడు!"అంది అమ్మ. అమ్మ కళ్ళలో పట్టరాని సంతోషం కన్పిస్తోంది.

అందరం కలిసి మా పొలంకేసి నడిచాము.

నా జీవితంలో నాకెప్పుడూ కలగనంత గొప్ప ఆనందం కలిగింది అక్కడ కన్పించిన దృశ్యం చూడగానే...

కాడెద్దులతో ఒడుపుగా నేలను దున్నుతున్నాడు నా తమ్ముడు. వాడి వెంబడి నాగేటి సాలులో గింజలు వేస్తూ నిండుగా నడుస్తోంది మరదలు.

మమ్మల్ని చూడడం ఆలస్యం... పని ఆపేసి ఇద్దరూ పరుగుపెట్టుకు వచ్చి ఒక్కటే ఏడుపు...

ఏడుపులు, ప్రశ్న జవాబులు ముగిశాక నా తమ్ముడు మడక విప్పి ఎద్దులను తీసుకుపోయి క్రింద పిల్లకాలువలో నీళ్ళు తాపుకుని బిందెతో నీళ్ళు పట్టుకువచ్చాడు. ఆపై అందరం నీడపాటున కూర్చుని గంపలోని అన్నం, కూరా తలాకాస్త తిన్నాము.

"మీరింటికి పదండి... మేమీ చెక్క దున్నేసి ఈ కాసిన్ని గింజలూ వేసేసి వస్తాము!" అన్నాడు తమ్ముడు మడక కడ్తూ.

నా మరదల్ని చెట్టునీడన కూర్చోబెట్టి గింజల గంప అందుకుని మడక వెంబడి కదిలింది కనకం.

ఆ మట్టి వాసన వదిలి అక్కడ్నుండీ కదలాలనిపించకపోయినా ఇల్లు చూడాలనే కోరికతో ఆతృతగా కదిలాను. బాబునెత్తుకుని నా వెంబడి బయల్దేరింది అమ్మ.

ఊర్లోకి అడుగుపెట్టి రచ్చబండ దగ్గరకు చేరగానే నా ఆనందానికి అవధులు లేవు.

అక్కడ ఆ పక్కగానే కొత్తగా కట్టిన పంచాయతీ పాఠశాల పెద్దెత్తుతో కన్పించింది.

రచ్చబండ దగ్గర నిలబడిపోయి అటే చూస్తుండిపోయాను.

అర నిముషం తరువాత...

"నేనున్నా లేకపోయినా బిడ్డల్నెలాగయినా బాగా సదివించాలి బాగ్యం!" అన్న ఆ జబ్బుమనిషి మాటలు చెవుల్లో మెదిలి కంటనీరు తిరిగింది. ★